కాంగ్రెస్ నాయకుల వినూత్న నిరసన



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీనివాస్, డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు

మలక్‌పేట: మూసారంబాగ్‌లో మూసీ పరీవాహక ప్రాంతంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వినూత్న నిరసన చేపట్టారు. మూసీ సుందరీకరణలో భాగంగా ఇటీవల తీరప్రాంతంలోని నివాసాలను ప్రభుత్వం ఖాళీ చేయించి వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారు. నివాసాల కూల్చివేతలపై బీఆర్‌ఎస్, బీజేపీ నేతల వ్యాఖ్యలకు వ్యతిరేకంగా లబ్ధిదారులతో కలిసి ఖాళీ చేసిన నివాసాల్లో మడత మంచాలు, పరుపు, దిండు ఏర్పాటు చేశారు. కేసీఆర్, కేటీఆర్, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఫొటోలు పెట్టి పూలదండలతో స్వాగతం పలికారు. మూసీ తీరంలో వారు ఒక రోజు నిద్రచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. తమ ఇష్టపూర్వకంగానే ఇండ్లు ఖాళీ చేశామన్నారు. ఇళ్లు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శాలీవాహన నగర్ సాయిలు హోట్స్ డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

చంపాపేట: దశలవారీగా సమస్యలు పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి అన్నారు. శ్రీనిధి కాలనీలో రూ.40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మధుసూధన్‌రెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు చంద్రమోహన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రావు, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, సురేశ్, గోపీ, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

కలెక్టర్ హన్మంతరావుకు శుభాకాంక్షలు



కలెక్టర్ హన్మంతరావును సన్మానిస్తున్న యాదగిరి

చంపాపేట: భువనగిరి యాదాద్రి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మంత్రిప్రగడ హన్మంతరావును చంపాపేటకు చెందిన అయ్యప్ప సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి కొండా యాదగిరి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కీర్తన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా, మీడియా ఇన్‌చార్జిగా ఆర్కేపురం డివిజన్‌కు చెందిన బీబీఆర్ వేణు నియామకమయ్యారు. ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రం అందుకున్నాడు. వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో ఓబీసీ మోర్చా బలోపేతానికి కృషి చేస్తానన్నారు. జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఆశీస్సులతో తన నియామకానికి సహకరించిన రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడు బొక్క నరసింహ రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, గీత సెల్ కో కన్వీనర్ రాగుల కిరణ్ కుమార్ గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



వేణుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆనంద్‌గౌడ్

ఏసీపీల ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య



మాట్లాడుతున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి

హస్తినాపురం: సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతిని పురస్కరించుకుని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ రన్‌ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ నుంచి పనామా చౌరస్తా, సుష్మాథియేటర్ జంక్షన్, రైతుబజార్, గణేశ్ ఆలయం వరకు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతను దేశభద్రతను ఇంటిగ్రిటీని కాపాడుతామన్నారు. ర్యాలీలో వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు సీహెచ్.శ్రీనివాస్ , నాగరాజుగౌడ్, అంజిరెడ్డి, నాగరాజు, ఎస్‌ఐలు, సిబ్బంది దాదాపు 150 మంది పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో ..

నాగోలు: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ పోలీసులు ఎల్‌బీనగర్ చౌరస్తా నుంచి కొత్తపేట విక్టోరియా మెమోరియల్ చౌరస్తా వరకు గురువారం పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్, నాగోలు, చైతన్యపురి, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్లు వినోద్‌కుమార్, సూర్యనాయక్, వెంకటేశ్వరావు, యాదగిరి, సరూర్‌నగర్ ఉమెన్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో పాటు పలువురు ఎస్‌ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదాలు జరిగాయి. వివరాల్లోకి వెళ్తే.. సంస్థాన్ నారాయణపురం మహ్మదాబాద్ గ్రామానికి చెందిన పిన్నింటి సత్తిరెడ్డి చౌటుప్పల్ ఎస్‌బీఐలో ఉద్యోగి. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వినాయక్‌నగర్‌కాలనీలో అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశారు. కొన్నిరోజులుగా కార్పెంటర్ పనులు జరుగుతున్నాయి. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ జరిగి అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. అపార్ట్‌మెంట్‌లోని ఓ గదిలో నిద్రిస్తున్న యూపీకి చెందిన కార్పెంటర్ అనిల్ సహానీ (21)ని స్థానికులు కిటికీ గ్రిల్స్ తొలగించి బయటకు తీశారు. ఫైర్‌సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాంటే అపార్ట్‌మెంట్ పక్కనే గ్యాస్ గోదాం ఉందని మంటలు అందులోకి వ్యాపిస్తే భారీ స్థాయిలో నష్టం జరిగేదని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. కొన్నేళ్లుగా గోదాంను తరలించాలని కోరుతున్నా నిర్వాహకులు స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్యాస్ ఏజెన్సీని తరలించాలని కోరుతున్నారు.

మరో ఘటనలో..

మన్సూరాబాద్ డివిజన్ మధురానగర్‌కాలనీలో పటాకులు కాల్చుతుండగా నిప్పురవ్వలు సమీపంలోని ప్రింటింగ్ ప్రెస్‌లోకి వెళ్లడంతో అందులోని పేపర్లకు మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. కాలనీలో ఇరువైపులా ర్యాంపుల ఏర్పాటు, వాహనాల పార్కింగ్‌తో ఫైరింజన్ రాలేకపోయింది. స్థానికులు, సిబ్బంది శ్రమించి మంటలను ఆర్పివేశారు.



అపార్ట్‌మెంట్‌లో ఎగిసి పడుతున్న మంటలు

ఫర్నీచర్ దుకాణంలో..

చైతన్యపురి: ఫర్నీచర్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. సరూర్‌నగర్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అహ్మద్ అనే వ్యక్తి చైతన్యపురి మెట్రో స్టేషన్ సమీపంలో ఈస్ట్ ఉడ్ ఫర్నీచర్ షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో దుకాణం నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అప్పటికే మంటలు వ్యాపించి ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటల ఆర్పివేశారు. ప్రాణ నష్టం జరగలేదని ఎస్‌ఐ తెలిపారు. దుకాణం యజమాని అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంబరాన్నంటిన దివాళి సంబరాలు



దీపావళి ప్రమిదతో చిన్నారి

ఎల్‌బీనగర్, మలక్‌పేట్ నియోజకవర్గాలవ్యాప్తంగా గురువారం దివాళి సంబరాలు అంబరాన్నంటాయి.ఈ సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు దైవదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇండ్లు, వ్యాపార కేంద్రాలను పూలదండలతో అలంకరించి కేదారీశ్వర వ్రతం ఆచరించారు. సాయంత్రం చిన్న పెద్ద తేడా లేకుండా పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఇదిలాఉంటే పలువురు కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

–ఎల్‌బీనగర్, మలక్‌పేట్ జోన్ల బృందం



దేప భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న గణేశ్ నిర్మలా



పూజల్లో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా దంపతులు



పూజల్లో వీరేందర్‌బాబు యాదవ్



బాబా సన్నిధిలో దీపాలంకరణ ..



దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో ..



ఎస్‌వీవీ హైస్కూల్లో వేడుకలు..

కులగణన నిర్ణయం హర్షణీయం

చంపాపేట: రాష్ట్రంలో కుల గణన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే కార్యక్రమాలకు తమ కార్యకర్తలు సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



నరేశ్‌యాదవ్

హస్తినాపురం: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని హస్తినాపురం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్ విమర్శించారు. హస్తినాపురంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. వాగ్దానాలన్నింటిని నెరవేర్చే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు.

చైన్ స్నాచింగ్

లింగోజిగూడ: మహిళా మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్‌కు చెందిన మేకం బాలమ్మ గురువారం సాయంత్రం తొర్రూర్ ప్రధాన రహదారిలో దీపాల కొనుగోలు చేసేందుకు వెళ్లింది. అనంతరం ఇంటికి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కోని పారిపోయాడు. వెంటనే బాలమ్మ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



హసీనాబేగం

చంచల్‌గూడ: మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటన శుక్రవారం మాదన్నపేట పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన హసీనా బేగం (36) కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమె తల్లి ముత్తాహారున్నీసా చికిత్స కోసం చంచల్‌గూడలోని నర్సింగ్ హోంకు తీసుకువచ్చింది. వైద్యులతో మాట్లాడి వచ్చేసరికి కూతురు కనిపించలేదు. పలుచోట్ల వెతికినా, బంధువులను ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐఎస్‌సదన్ కార్పొరేటర్‌కు పితృవియోగం



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తండ్రి బద్దం సుధాకర్‌రెడ్డి (70) బుధవారం మృతి చెందారు. సైదాబాద్‌లో నివసించే సుధాకర్‌రెడ్డి వాణి ప్రింటింగ్ ప్రెస్ పేరిట వ్యాపారం నిర్వహించేవారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కూతురు ప్రస్తుతం ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్. ఆయన మరణ వార్త తెలుసుకున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సైదాబాద్ దోబీఘాట్‌లోని శ్మశానవాటికలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

సందడిగా సదర్ సమ్మేళనాలు



గోవుకు పూజ చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్



కొత్తపేట డివిజన్‌లో కార్పొరేటర్ పవన్‌కుమార్

చంచల్‌గూడ: చంచల్‌గూడ రోడ్డులో ఉప్పరిగూడ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలు రాత్రంతా కొనసాగాయి. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్‌తో కలిసి ఆయన ప్రధాన స్వాగత వేదిక వద్ద శ్రీకృష్ణుడికి పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో యాదవ సంఘం ప్రతినిధులు సంపత్‌యాదవ్, నిరంజన్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, రాజేశ్వర్ యాదవ్, వినయ్‌కిశోర్‌యాదవ్, రాముయాదవ్, ధన్‌రాజ్‌యాదవ్, రాహుల్‌యాదవ్, రాజ్‌పాల్‌యాదవ్, పెరిక శ్రీనివాస్, ప్రమోద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. సైదాబాద్, మాదన్నపేట ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రాఘవేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మన్సూరాబాద్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లో గురువారం రాత్రి యాదవ సదర్ సమ్మేళనాన్ని నిర్వహించారు. చర్లపల్లి, మన్సూరాబాద్ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, యాదవ సంఘం నేతలు సత్యనారాయణ యాదవ్, జగదీశ్‌యాదవ్ హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన దున్నలు పలు విన్యాసాలు చేశాయి. అనంతరం దున్నల యజమానులను మెమోంటో అందించి నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పోచబోయిన గణేశ్‌యాదవ్, మల్లెల శ్రీనివాస్‌యాదవ్, పోచబోయిన మల్లెల శ్రీనివాస్‌యాదవ్, చిట్టీ యాదవ్, కేశబోయిన నగేశ్‌యాదవ్, పోచబోయిన వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి సదర్ సమ్మేళనం నిర్వమించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి దున్న పోతులను తీసుకువచ్చి ఊరేగించారు. కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీ గాయత్రీనగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

లింగోజిగూడ: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీగాయత్రీనగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నేనావత్ సూర్య నాయక్, ఉపాధ్యక్షుడిగా నరసింహారెడ్డి వేమిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కే.చైతన్యరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా గంగాధర్ దేవటెడ్, కోశాధికారిగా వీ.శేషఫణి భరద్వాజ్, లీగల్ అడ్వైజర్‌గా రామచందర్, అడ్వైజర్ కమిటీ సభ్యులుగా జగదీశ్, ప్రసాద్ అన్నవరపు, బసయ్య, శివ రామకృష్ణ, రాములు, సంక్షేమ సంఘం సభ్యులుగా ఇస్లావత్ జగదీశ్ నాయక్, కేతవత్ శ్రీకాంత్, కే.నాగేందర్, నవీన్‌కుమార్, రమేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ కాలనీ అబివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కార్తీకమాసం వచ్చేసింది

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- నెలరోజుల పాటు సందడిగా మారనున్న శివాలయాలు
- దీపాలతో కళకళలాడుతున్న టెంపుల్స్



మీర్‌పేట్‌లో అలంకరించిన శివలింగం



మలక్‌పేట్‌లోని హరిహర క్షేత్రం

దిల్‌సుఖ్‌నగర్: భక్తులకు పరమ పవిత్రమైన కార్తీక మాసం వచ్చేసింది. ఇక నెల రోజుల పాటు శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగనున్నాయి. అంతట శివోహం..ఎక్కడ చూసిన శివనామస్మరణతో, భక్తిప్రపత్తులతో, నియమనిష్టలతో గడిపే కార్తీకమాసం ప్రారంభంతో ఆలయాలు మరింత సందడిగా మారనున్నాయి.

మలక్‌పేట్‌జోన్ పరిధిలో..

కార్తీక మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శివాలయాలు, అమ్మవారి ఆలయాలతోపాటు, పలు వైష్ణ దేవాలయాలను పూలమాలలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దిల్‌సుఖ్‌నగర్, అక్బర్‌బాగ్, సరూర్‌నగర్, మలక్‌పేట్, సైదాబాద్, ఐఎస్‌సదన్, ఆర్‌కేపురం, మాదన్నపేట్, ఆర్‌కేపురం వాసవీకాలనీలోని అష్టలక్ష్మి, దిల్‌సుఖ్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి, షిర్డీసాయి బాబా ఆలయాలు, శివాలయం, కర్మన్‌ఘాట్‌లోని శ్రీధ్యానాంజనేయస్వామి, శ్రీహరిహర క్షేత్రం, ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రద్దీగా శివాలయాలు..

కార్తీక మాసం సందర్భంగా శివాలయాలు భక్తులతో సందడిగా మారనున్నాయి. కార్తీకమాస దీపారాధనల కోసం ఉదయం 4 గంటల నుంచే వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులు అయ్యప్పస్వామి మాలాధారణ కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



సరూర్‌నగర్‌లోని మహా శివుడు

నెలరోజుల పాటు కార్తీక మాస పూజలు

మన్సూరాబాద్: కార్తీక మాసం పురస్కరించుకుని నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలోని కాశీవిశ్వేశ్వరస్వామికి డిసెంబర్ 1 వరకు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఆక్రమణ భూముల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు

నాగోలు: బండ్లగూడ ఫతుల్లాగూడ గ్రామంలోని కంతం భూమిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని గ్రామస్తులు ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ అశ్విని, విజయలక్ష్మి, సర్వేయర్ వెంకట్ ఇతర అధికారులు శుక్రవారం సదరు భూమిని పరిశీలించారు. ఈ భూమి తమ పరిధిలోకి రాదని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వెంటనే వారు జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ మధ్యలో ఉన్న 2,500 గజాల స్థలంలో రెండు రోజులుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని కోరారు.

నియోజకవర్గంపై ఎమ్మెల్యేకు మంచి పట్టు



మాట్లాడుతున్న మాధవరం నరసింహరావు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మంచి పట్టు ఉందని రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మాధవరం నరసింహరావు అన్నారు. బీఎన్‌రెడ్డినగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 ఎన్నికల్లో పోటీచేసే వరకు కూడా మధుయాష్కిగౌడ్‌కు ఎల్‌బీనగర్ సరిహద్దులు కూడా తెలియవన్నారు. నియోజవర్గ సమస్యల పరిష్కారం, రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరిస్తానని కేటీఆర్ హామీనివ్వడంతోనే గతంలో సుధీర్‌రెడ్డి పార్టీ మారారని గుర్తుచేశారు. ఎప్పటికైనా రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం సుధీర్‌రెడ్డితోనే సాధ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉజ్జిని హరీశ్‌రావు, మేకల శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఛట్ పూజలకు అనుమతించాలని వినతి



చంపాపేట: ఈనెల 7, 8 తేదీల్లో చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజానేయ ఆలయ కోనేరులో ఛట్ పూజలకు అనుమతించాలని ఉత్తర భారత్ నాగరిక్ సంఘ్ హైద్రాబాద్ ఛట్ పూజల నిర్వాహక అధ్యక్షుడు ఎస్‌కే సింగ్ కోరారు. ఈమేరకు ఆలయ ఈఓ లావణ్యను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యేటా కోనేరులో సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ్ సభ్యులు అమర్ జీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల శుభ్రత అందరి బాధ్యత



పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి


ఎల్‌బీనగర్: పార్కులను శుభ్రంగా ఉంచే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శ్రీ పురంకాలనీ పార్కును కాలనీవాసులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులకు వచ్చే సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సికిందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్‌రెడ్డి, కోశాధికారి జంగయ్యగౌడ్, సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



చాదర్‌ఘాట్: దేశానికి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు చొకి రవికుమార్, బాబు శ్రీనివాస్ అన్నారు. ఇందిరా గాంధీ వర్ధంతి పురస్కరించుకుని శుక్రవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ, రాజు, నరేందర్ పాల్గొన్నారు.

మహా అన్నదానం



చంపాపేట: శ్రీమాతా అన్నపూర్ణేశ్వర అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ ఆధ్వర్యంలో చంపాపేట మూడుగుళ్ల ఆవరణలో శుక్రవారం మహా అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ భగవాన్‌జీ మాట్లాడుతూ.. 16 నెలలుగా అమావాస్య రోజున శాఖాహారంతో కూడిన అన్న ప్రసాదాన్ని వితరణ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, ట్రస్ట్ సభ్యులు సంతోష్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, హరిలాల్, సుశీల్‌కుమార్, సంతోష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.